సాక్షి
ఖమ్మం
గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



'ఇందిరమ్మ'లో ముందంజ

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో ఉంది. జిల్లాకు మొత్తం 16,441 ఇళ్లు మంజూరయ్యాయి. 8లో



'స్థానిక' ఎన్నికల్లో కష్టపడాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పని చేయాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. 8లో



వాతావరణం

జిల్లా వ్యాప్తంగా గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా



ఖమ్మం రాపర్తినగర్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈనెల 12న నగరంలోని టేకులపల్లి మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ హైదరాబాద్‌లో ఫార్మసిస్ట్ పోస్టులు 40, ట్రైనీ ఫార్మసిస్ట్ 20, అసిస్టెంట్ ఫార్మసిస్ట్ 30, రిటైల్ ట్రైనీ 10 పోస్టులకు ఇంటర్వ్యూలు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10 గంటలకు జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

2,680 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాలకు పంపిణీ

ఖమ్మంవ్యవసాయం: చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు బుధవారం ఐపీఎల్ కంపెనీకి చెందిన 2,680 మెట్రిక్ టన్నుల యూరియాను ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ ఎరువును ఖమ్మం జిల్లాకు 1,380, భద్రాద్రి జిల్లాకు 800, మహబూబాబాద్ జిల్లాకు 500 మెట్రిక్ టన్నుల చొప్పున పంపిణీ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వ్యవసాయ శాఖ ద్వారా కూపన్లు జారీ చేసి యూరియా పంపిణీ జరిగేలా ఏర్పాట్లు చేయగా.. పోలీసు పహారాలో అందించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

ఖానాపురం చెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న ఎస్ఈ, అధికారులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 3, 6 డివిజన్ల మధ్య ఉన్న ఖానాపురం చెరువును జలవనరుల శాఖ అధికారులు బుధవారం సందర్శించారు. చెరువులను అభివృద్ధి చేసే ప్రక్రియలో భాగంగా ఏయే పనులు చేపట్టాలి, కట్టల పటిష్టత, పూడిక తీత, అలుగుల మరమ్మతులు తదితర అంశాలపై అంచనాలు రూపొందిస్తున్నట్లు ఆ శాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వెంట డీఈ ఉదమ్‌ప్రతాప్, రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకుడు మలీదు మనీష్ తదితరులు ఉన్నారు.

డెంగీ బాధితులు కోలుకున్నారు

- చికున్ గున్యా, మలేరియా కేసులు కూడా లేవు
- డీఎంహెచ్ఓ కళావతిబాయి వెల్లడి



చెరువుమాధారంలో రికార్డులు పరిశీలిస్తున్న కళావతిబాయి

నేలకొండపల్లి : జిల్లాలో డెంగీ కేసుల బాధితులంతా కోలుకున్నారని, ఎలాంటి ప్రమాదం లేదని డీఎంహెచ్ఓ డాక్టర్ డి.కళావతిబాయి అన్నారు. నేలకొండపల్లి పీహెచ్‌సీని, చెరువుమాధారం, పైనంపల్లి ఉప కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 3.11లక్షల ఇళ్లలో సర్వే నిర్వహించి, 7.45 లక్షల మందికి వైద్య పరీక్షలు చేశామని తెలిపారు. ఇందులో 3,712 మందికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. జిల్లాలో 155 డెంగీ కేసులు నమోదు కాగా.. వారంతా రికవరీ అయ్యారని తెలిపారు. చికున్ గున్యా, మలేరియా కేసులు లేవని చెప్పారు. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. నేలకొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని చెరువుమాధారానికి తరలించే విషయం ప్రస్తుతానికి లేదన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్.ఆర్.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐల బదిలీ



ఖమ్మంక్రైం: జిల్లాలో ఇద్దరు ఎస్ఐలను బదిలీచేస్తూ సీపీ సునీల్‌దత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం టూటౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న సంధ్యను ఏన్కూరుకు, అక్కడ పనిచేస్తున్న ఉపతల రఫీని ఖమ్మం వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పరిషత్ లెక్క తేలింది



జిల్లాలో పరిషత్ ఓటర్లతో పాటు పోలింగ్ స్టేషన్ల లెక్క తేలింది. మొత్తం 8,02,690 మంది ఓటర్లతో పాటు 1,580 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. ఈ వివరాలను బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రకటించారు. ఈనెల 2న గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల వివరాలు వెల్లడించగా.. జీపీల్లో 8,02,691 మంది ఓటర్లు, 5,214 పోలింగ్ స్టేషన్లుగా ఖరారయ్యాయి. హైకోర్టు తీర్పును అనుసరించి ఈనెల 30లోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత సమస్య నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ఇటు ప్రభుత్వం, అటు ఎన్నికల సంఘం ఎటువంటి నిర్ణయం తీసుకోకున్నా అధికారులు మాత్రం ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

మండలాల వారీగా ఓటర్ల వివరాలు..

మండలం	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు
బోనకల్	36,381	17,611	18,769	01
చింతకాని	41,707	19,987	21,720	0
ఏన్కూరు	27,920	13,390	14,530	0
కల్లూరు	35,530	17,364	18,166	0
కామేపల్లి	35,538	17,436	18,102	0
ఖమ్మంరూరల్	35,797	17,155	18,640	02
కొణిజర్ల	41,864	20,370	21,493	01
కూసుమంచి	50,149	24,251	25,896	02
మధిర	31,728	15,306	16,419	03
ముదిగొండ	48,554	23,274	25,278	02
నేలకొండపల్లి	49,533	23,691	25,841	01
పెనుబల్లి	43,873	21,342	22,531	0
రఘునాథపాలెం	40,790	19,420	21,366	04
సత్తుపల్లి	36,160	17,424	18,735	01
సింగరేణి	45,411	22,205	23,205	01
తల్లాడ	46,261	22,547	23,713	01
తిరుమలాయపాలెం	50,771	24,557	26,213	01
వేంసూరు	36,992	18,122	18,870	0
వైరా	27,306	13,175	14,130	01
ఎర్రుపాలెం	40,425	19,616	20,808	01
మొత్తం	3,88,243	4,14,425	8,02,690	22

మొత్తం ఓటర్లు 8,02,690..
పోలింగ్ స్టేషన్లు 1,580

- ఎన్నికల ప్రక్రియలో పూర్తయిన తొలి అంకం
- ఈనెల 2న జీపీ ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల సంఖ్య వెల్లడి
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండేలా ప్రణాళిక

మహిళలే అధికం..

జిల్లాలోని 283 ఎంపీటీసీలు, 20 జెడ్పీటీసీల పరిధిలో 8,02,690 మంది ఓటర్లు ఉన్నట్లు జిల్లా అధికారులు ఖరారు చేశారు. వీరిలో 3,88,243 మంది పురుషులు, 4,14,425 మంది మహిళలు, 22 మంది ఇతరులు ఉన్నారు. అలాగే 1,580 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. ఇందులో 500 మంది ఓటర్లలోపు 757, 501 నుంచి 700లోపు ఓటర్లు ఉన్న పీఎస్‌లు 823 ఉన్నాయి. ఈ మొత్తం ఓటర్ల తుది జాబితాను జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రదర్శించారు. గ్రామపంచాయతీ, పరిషత్ ఓటర్ల, పోలింగ్ స్టేషన్ల జాబితాల ప్రకటనతో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మొదటి అంకం ముగిసినట్టయింది.



జిల్లా పరిషత్ కార్యాలయంలో ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

తిరుమలాయపాలెంలో అత్యధికం..

మొత్తం పరిషత్ ఓటర్లలో తిరుమలాయపాలెం మండలంలో అత్యధికంగా 50,771 మంది ఉన్నారు. ఈ మండలంలో 18 ఎంపీటీసీ స్థానాలున్నాయి. రెండో స్థానంలో కూసుమంచి మండలం నిలిచింది. ఇక్కడ 17 ఎంపీటీసీ స్థానాల్లో 50,149 మంది ఓటర్లు ఉన్నారు. మూడో స్థానంలో ఉన్న నేలకొండపల్లి మండలంలో 18 ఎంపీటీసీ స్థానాల్లో 49,533 మంది ఓటర్లుగా తేలారు. ఇక అత్యల్పంగా వైరా మండలంలోని 10 ఎంపీటీసీ స్థానాల్లో 27,306 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో ఎంపీటీసీ స్థానాల వారీగా చూస్తే అత్యధికంగా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా ఎంపీటీసీ స్థానంలో 5,362 ఓటర్లు, మధిర మండలం అల్లినాగారంలో అత్యల్పంగా 789 మంది ఓటర్లు ఉన్నారు.

ఈనెల 2న జీపీల ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల ప్రకటన..

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు ఇటీవల ప్రభుత్వం ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. ఈ క్రమంలో జిల్లాలో గ్రామపంచాయతీలు, పరిషత్ ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను విడుదల చేయడంతోపాటు పూర్తిస్థాయి ఓటర్ల జాబితా కూడా విడుదలైంది. ఈనెల 2న ప్రకటించిన తుది జాబితాలో 571 గ్రామ పంచాయతీల్లో మొత్తం 8,02,691 మంది ఉండగా.. 5,214 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఓటర్ల ముసాయిదా జాబితా కన్నా తుది జాబితాలో ఒక్క ఓటరు పెరిగారు.

ఉప్పొంగిన గంగ!

- జిల్లాలో 1.5 మీటర్ల మేర పెరిగిన భూగర్భ జలాలు
- గతేడాది కంటే మరింత దగ్గరగా..
- పొదుపుగా వినియోగిస్తే మేలంటున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: గత రెండేళ్లుగా భూగర్భ జలాలు పైకి వస్తున్నాయి. జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో పాటు సరిహద్దు జిల్లాల నుంచి కూడా జలాలు వస్తుండమే దీనికి కారణమని అంటున్నారు. భూగర్భ జలాలు పెరుగుతున్న క్రమంలో కొంత మేర తాగు, సాగునీటి ఇబ్బందులు తప్పే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

ప్రతీనెలా కొద్దికొద్దిగా..

జిల్లాలోని 21 మండలాల్లో గత నాలుగు నెలలుగా భూగర్భ జలాలను పోలిస్తే ప్రతీ నెలలోనూ గతం కంటే ఈ సంవత్సరం పైకి చేరుకున్నాయి. 2024 మేలో 7.30 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా.. ఈ ఏడాది 5.89 మీటర్ల లోతులోనే ఉన్నాయి. అంటే సుమారు 1.50 మీటర్ల మేర పైకి చేరాయి. గతేడాది జూన్‌లో సరాసరి 6.99 మీటర్లు ఉంటే ఈ ఏడాది 5.69 మీటర్లకు చేరాయి. 2024 జూలైలో 4.59 మీటర్ల లోతులో ఉంటే ఈ ఏడాది 3.87 మీటర్ల పైకి చేరాయి. గత ఆగస్టులో 3.10 మీటర్ల లోతులో ఉండగా ఈ ఏడాది ఆగస్టులో 2.72 మీటర్ల లోతులోనే భూగర్భజలాలు అందుతుండడం విశేషం.

అన్ని మండలాల్లోనూ ఆశాజనకమే..

జిల్లాలోని ప్రతీ మండలంలో భూగర్భజలాలు పెరిగాయి. గతంలో ఒకటి, రెండు మండలాల్లో ఎక్కువ ఉండగా.. ఈసారి మాత్రం అన్ని మండలాల్లోనూ ఆశాజనకంగానే ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఉన్న నీటిని పొదుపుగా వాడుకుంటే భవిష్యత్‌లో నీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది జూలైలో 3.87 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా.. ఆగస్టులో 2.72 మీటర్లకు చేరాయి. దీంతో ఒక్క నెలలోనే సుమారు 1.15 మీటర్ల లోతు భూగర్భజలాలు పైకి చేరాయి.



పెనుబల్లి ఎంపీడీఓ కార్యాలయంలో భూగర్భజలాలను పరిశీలిస్తున్న అధికారులు

జిల్లాలో భూగర్భ జలాల లభ్యత ఇలా (మీటర్లలో)

నెల	2024	2025	సరాసరి పెరుగుదల
మే	7.30	5.89	1.41
జూన్	6.99	5.69	1.3
జూలై	4.59	3.87	0.72
ఆగస్టు	3.10	2.72	0.38

నీటిని పొదుపుగా వాడుకోవాలి



2025 – 26 సంవత్సరంలో వర్షపాతం 31 శాతం అధికంగా నమోదైంది. అందుకు అనుగుణంగా భూగర్భజలాలు సరాసరి 1.16 మీటర్లు పెరిగాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటిని పొదుపుగా వాడుకోవాలి. భూగర్భ జలాల సుస్థిరతకు ఇంటింటికీ ఇంకుడు గుంతలు, వ్యవసాయ బోరుబావి దగ్గరలో ఫామ్‌పాండ్ వంటి నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాలి.

– ఎం.రమేష్, జిల్లా భూగర్భజల శాఖాధికారి

రాముడి ఆదాయం రూ.1.52 కోట్లు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆలయ హుండీలను బుధవారం లెక్కించారు. ఆలయ ఈఓ దామోదర్ రావు ఆధ్వర్యంలో దేవస్థానంలోని హుండీలను తెరిచి చిత్రకూట మండపానికి తరలించారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ సభ్యులు లెక్కింపు చేపట్టారు. 72 రోజులకు రూ.కోటి 52 లక్షల 59 వేల 499ల నగదు, మిశ్రమ బంగారం 0.089 గ్రాములు, మిశ్రమ వెండి కేజీ వచ్చినట్లు ఈఓ తెలిపారు. యూఎస్ డాలర్లు 624, సౌత్రాఫికా ర్యాండ్స్ 450, ఆస్ట్రేలియా డాలర్లు 10, యూఏఈ దిరామ్స్ 10, కెనడా డాలర్లు 230, యూరప్ యూరోలు 30తోపాటు మరికొన్ని ఇతర దేశాల మాదక ద్రవ్యం వచ్చినట్లు వెల్లడించారు.

కమనీయం... కల్యాణం

రామయ్య స్వామివారి నిత్యకల్యాణం బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

పోరాటస్ఫూర్తికి ప్రతీక.. ఐలమ్మ

అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: పోరాట స్ఫూర్తికి ప్రతీకగా వీర వనిత చాకలి ఐలమ్మ నిలుస్తారని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఐలమ్మ మహిళా శక్తికి ప్రతీక అని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చేసి వీర వనితగా చరిత్రలో నిలిచారని కొనియాడారు. అటువంటి వీరవనితను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంఘ సేవకురాలిగా, భూమి, భుక్తి కోసం, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమ స్ఫూర్తిదాయకం అన్నారు. ఆమె ఆశయాలను నేటి తరం వారు కొనసాగించాలని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారిణి జి. జ్యోతి, బీసీ సంఘం నాయకులు తుపాకుల ఎలగొండ స్వామి, నారాయణ, శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, జక్కుల వెంకటరమణ, మిట్టపల్లి శంకర్, గోనెల శివప్రసాద్, గోనెల రవిశంకర్, దాసరి నాగేశ్వరరావు, కె. గోవిందరావు, కె. కొండల రావు తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరెడ్డి తదితరులు

4,654 ఎకరాల్లో పంటలకు నష్టం

- అత్యధికంగా 4,386 ఎకరాల్లో పెసరకే..
- బాధిత రైతులు 3,635 మంది..
- రూ.4.65 కోట్ల పరిహారం అందించాలని సర్కారుకు నివేదిక

ఖమ్మంవ్యవసాయం : జిల్లాలో ఇటీవల భారీగా కురిసిన వర్షాలతో 3,635 మంది రైతులకు చెందిన 4,654 ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ మేరకు బుధవారం రాత్రి వివరాలు వెల్లడించింది. జిల్లాలో వరి, పత్తి, పెసర, ఉద్యాన పంటలు సాగులో ఉన్నప్పటికీ అత్యధికంగా పెసర పంటకు నష్టం వాటిల్లిందని, ఎకరాకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ. 4.65 కోట్లు పరిహారం అందించాలని నివేదికలో పేర్కొంది. పంట నష్టాలకు సంబంధించిన సమగ్ర నివేదికను వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ఆగస్టు మూడు, నాలుగు వారాల్లో నైరుతి రుతుపవనాలు, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. దీనికి తోడు ఎగువన కురిసిన వానలతో నదులు, వాగులు, జలాశయాలు ఉప్పొంగాయి. దీంతో వాటి పరీవాహక ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబర్ ఆరంభం నుంచి క్షేత్ర స్థాయిలో వ్యవసాయ విస్తరణాధికారులు పంట నష్టాలపై సమగ్ర సర్వే నిర్వహించి జిల్లా వ్యవసాయ శాఖకు నివేదికలు అందించారు.



పత్తి పంట నష్టాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

10 మండలాల్లో పంటలకు నష్టం

భారీ వర్షాలతో చింతకాని, కొణిజర్ల, తల్లాడ, వైరా, కూసుమంచి, కారేపల్లి, కల్లూరు, ఏన్కూరు, రఘునాథపాలెం, బోనకల్ మండలాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ నివేదికల్లో పేర్కొంది. అత్యధికంగా చింతకాని మండలంలో 1,678 మంది రైతులకు చెందిన 2,255 ఎకరాల్లో, కొణిజర్ల మండలంలో 1,079 మంది రైతులకు చెందిన 1,292 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది.

అధిక విస్తీర్ణంలో పెసరకు..

చేతికందే దశలో ఉన్న పెసర పంటకు అధిక విస్తీర్ణంలో నష్టం వాటిల్లింది. 3,286 మంది రైతులకు చెందిన 4,386 ఎకరాల్లో పెసర పంటకు నష్టం వాటిల్లగా ఈ పంటకు రూ. 4,38,63,500 పరిహారానికి వ్యవసాయ శాఖ సిఫార్సు చేసింది. వరి 137 ఎకరాల్లో, పత్తి 121, మినుము 3, టమాట 2, చిక్కుడు 1.20, కాకర ఎకరం, మిర్చి 30 గుంటల విస్తీర్ణంలో నష్టపోయినట్లు వెల్లడించిన అధికారులు.. ఎకరాకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ. 4,65,44,000 పరిహారానికి నివేదిక అందించారు.

పనుల్లో జాప్యాన్ని సహించం

- మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాలు వేగవంతం చేయాలి
- కలెక్టర్ అనుదీప్

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల పనులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ శ్రీజ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ.. పనుల్లో జాప్యం తగదని సూచించారు. ప్రారంభానికి ముందే అన్ని సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని, పనుల్లో నిర్లక్ష్యం, నాణ్యత లోపం ఉంటే సహించేది లేదని హెచ్చరించారు. రూ. 200 కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల డిజైన్ కూడా మంచి మోడల్‌గా ఉండాలని, వాస్తును పాటిస్తూ అకరణీయంగా ఉండేలా తీర్చి దిద్దాలని అన్నారు. గురుకుల పాఠశాల నిధులు తన అకౌంట్‌లో నిల్వ ఉన్నాయని, బిల్లుల జాప్యం పేరుతో పనులు ఆలస్యం చేస్తే సహించేది లేదని అన్నారు. ఎప్పటికప్పుడు బిల్లులు ఇస్తామని, పార్ట్ బిల్లు చేసిన 24 గంటల్లో చెల్లిస్తామని స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పన, తాగునీరు, డ్రెయినేజీ, విద్యుత్, రహదారుల వంటి పనులు సైతం పూర్తి చేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పాఠశాల ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలని సూచించారు. భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వ పరంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మెడికల్ కళాశాలలో ఇప్పటి వరకు రూ. 45 కోట్ల విలువైన పనులు పూర్తి చేయగా రూ.15 కోట్ల బిల్లులు అందించామని చెప్పారు. కాలేజీలో అంతర్గత రహదారులు, ప్రహరీ, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ పవార్, డీఈ లక్ష్మీనాయక్, ఏఈఈ లలిత, ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం తహసీల్దార్లు సైదులు, శ్వేత, ఎంఈఓ రాములు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటిగ్రేటెడ్ గురుకుల సముదాయ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

నిబంధనల ప్రకారం లే ఔట్ అనుమతులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో లేఔట్ అనుమతుల జారీ అంశంలో నిబంధనలు పాటించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన లేఔట్ కమిటీ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి అవసరమైన మేర భూమి లే ఔట్ లో కేటాయించేలా అధికారులు పరిశీలించాలని అన్నారు. నిబంధనలకు లోబడి మాత్రమే అనుమతులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌డీసీ ఎం. రాజేశ్వరి, సుడా సీపీఓ, పంచాయతీ రాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసా చారి, ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకోబు, ఈఈ తానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో పనిచేయాలి

ఖమ్మం సహకారనగర్ : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారీతనంతో పని చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. నగరంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల నిర్వహించిన పైలట్ ప్రజావాణి కార్యక్రమం తరహాలో మధిర నియోజకవర్గం పరిధిలోని 5 మండలాల్లోనూ నిర్వహణకు కార్యాచరణ చేపట్టామని, ఈ కార్యక్రమం అమలులో అధికారులు జవాబుదారీగా ఉండాలని అన్నారు. మండల స్థాయిలోనే ప్రజా సమస్యలు పరిష్కారం కావాలన్నారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ పైలట్ ప్రజావాణి కార్యక్రమం కింద మండల కేంద్రంలోని ఐఎఫ్‌సీ సెంటర్‌లో సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి రశీదు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, అధికారులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు కరీనా, శ్రీహర్ష, అఖిల్ సూర్య పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా, అంతరాయాలపై సమీక్ష

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో విద్యుత్ సరఫరా, అంతరాయాలపై టీజీఎస్పీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ టి.మధుసూదన్, చీఫ్ ఇంజనీర్ (ఆపరేషన్స్) రాజు చౌహాన్ బుధవారం ఖమ్మంలో విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో విద్యుత్ సరఫరాలో తీసుకుంటున్న చర్యలు, అంతరాయాలను అధిగమిస్తున్న విధానం, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. విద్యుత్ ప్రమాదాల నియంత్రణకు చేపట్టే కార్యక్రమాలపై కూడా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ.. అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. విద్యుత్ పరికరాల వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పించాలని, ప్రమాదాలను నియంత్రించాలని తెలిపారు. సమావేశంలో ఖమ్మం సర్కిల్ ఎస్ఈ శ్రీనివాసా చారి, ఎస్ఏఓ శ్రీధర్, డివిజనల్ ఇంజనీర్లు బాబూరావు, రామారావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రాములు, భద్రు పవార్, టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్, పక్కన అధికారులు

‘ఇందిరమ్మ’లో ముందంజ


పాలేరు నియోజకవర్గం ఆరెంపులలో పూర్తయిన ఇళ్లు

- వేగంగా సాగుతున్న గృహ నిర్మాణాలు
- ఇప్పటికే 81 శాతం మేర మార్కింగ్ పూర్తి
- పనుల పూర్తిపై వివిధ దశల్లో పర్యవేక్షణ

ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు దశల వారీగా ముందుకు సాగుతున్నాయి. పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టిన విషయం విదితమే. ఒక్కో అసెంబ్లీ నియోజక వర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేయగా.. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, తెల్లరేషన్ కార్డు గల వారికి తొలి దశలో కేటాయించారు. ఒంటరి మహిళలు, వితంతువులకు కూడా అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. జిల్లాలో నియోజక వర్గాల వారీగా మొత్తం 16,441 ఇళ్లు మంజూరు కాగా అందులో 13, 242 (81 శాతం) ఇళ్లకు మార్కింగ్ చేయగా, వివిధ దశల్లో నిర్మాణాలు సాగుతున్నాయి.

రాష్ట్రంలోనే జిల్లా టాప్..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో ఉంది. జిల్లాలోని ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు, ఇల్లెందు నియోజక వర్గ పరిధిలోని కామేపల్లి మండలం కలుపుకొని మొత్తం 16,441 ఇళ్లు మంజూరు చేశారు. నిర్మాణ పనుల వేగవంతానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోంది. మంజూరైన ఇళ్లలో 13,24 ఇళ్లకు ముగ్గులు పోయగా 7,700 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ నిర్మాణాలు పూర్తయ్యాయి. 1,922ఇళ్లు గోడల దశకు వచ్చాయి. 881 ఇళ్లు స్లాబ్ లెవల్‌కు చేరాయి. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం రూరల్ మండలంలో నాలుగు ఇళ్లు పూర్తి కాగా, 290 స్లాబ్ లెవల్‌లో, 638 గోడల లెవల్‌లో, 1,776 బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి. మరో 3,087ఇళ్లు మార్కింగ్ చేసి ఉన్నాయి. ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలంలో ఒకటి, వైరా నియోజకవర్గం పరిధిలోని ఏన్కూరు మండలంలో మూడు, కొణిజర్లలో ఒకటి, వైరాలో ఒకటి.. జిల్లా వ్యాప్తంగా మొత్తం 10ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

నియోజక వర్గాల వారీగా ఇళ్ల నిర్మాణాల పరిస్థితి ఇలా..

నియోజకవర్గం	మంజూరైన ఇళ్లు	ముగ్గు దశ	బేస్‌మెట్ లెవల్	గోడల లెవల్	స్లాబ్ లెవల్	పూర్తయిన ఇళ్లు
ఖమ్మం	3,285	1,557	724	40	10	01
పాలేరు	3,483	3,087	1,776	638	290	04
మధిర	2,792	2,503	1,637	69	89	--
సత్తుపల్లి	3,426	3,138	1,756	817	337	--
వైరా	2,923	2,529	1,585	302	128	05
కామేపల్లి	532	428	222	56	27	--
మొత్తం	16,441	13,242	7,700	1,922	881	10

వేగంగా సాగుతున్నాయి



జిల్లాలో మంజూరైన ఇళ్ల నిర్మాణ పనుల వేగవంతానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ముగ్గు పోసిన వాటిని బేస్‌మెంట్ స్థాయికి తీసుకొచ్చేందుకు క్షేత్ర స్థాయిలో కృషి జరుగుతోంది. బేస్‌మెంట్ స్థాయి దాటితే నిర్మాణ పనుల్లో వేగం పెరుగుతుంది. అనతి కాలంలోనే అన్ని ఇళ్లు పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నాం.

– బి. శ్రీనివాస్, హౌసింగ్ పీడీ

జీపీఓలు వచ్చేస్తున్నారు..


మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: రెవెన్యూ శాఖలో క్షేత్రస్థాయిలో సేవలు అందించేందుకు గ్రామ పాలనా అధికారులు (జీపీఓ) నేటి నుంచి విధుల్లోకి రానున్నారు. రెండు రోజుల క్రితం జీపీఓలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందించగా.. కలెక్టరేట్‌లో బుధవారం రాత్రి వరకు కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 380 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. వీటిని 299 క్లస్టర్లుగా విభజించారు. అయితే జీపీఓలు 252 మంది ఉన్నారు. వీరిలో ఇతర ప్రాంతాల నుంచి 13 మంది జిల్లాకు వస్తుండగా.. సుమారు 10 మంది ఇతర జిల్లాలకు వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 299 క్లస్టర్లకు 252 మంది జీపీఓలు ఉంటుండగా.. 56 మంది జూనియర్ అసిస్టెంట్లను జీపీఓల సేవలకు వినియోగించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నేడు అందనున్న ఆర్డర్లు..

జీపీఓల కౌన్సెలింగ్ బుధవారం రాత్రి వరకు నిర్వహించగా వారికి గురువారం ఉత్తర్వులు అందించనున్నారు. అయితే గురు, శుక్రవారాల్లో వారు బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

పైరవీలకు ఆస్కారం లేకుండా పోస్టింగ్‌లు

పైరవీలకు, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా మెరిట్ పద్ధతిలో గ్రామ పరిపాలనా అధికారులకు కౌన్సిలింగ్ చేపట్టి, పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామ పరిపాలనా అధికారులకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థ పటిష్టానికి ప్రభుత్వం గ్రామ పరిపాలనా అధికారులను నియమించిందన్నారు. జిల్లాలో పరీక్ష ద్వారా 252 మంది అర్హులైన వారికి మెరిట్ ప్రకారం వారి సొంత మండలం మినహాయించి, ఇతర ప్రదేశాల్లో పోస్టింగ్‌లు ఇస్తున్నామన్నారు. ప్రజావాణిలో, గ్రామాల సందర్శన సందర్భంగా ఎక్కువగా భూ సమస్యలపైనే దరఖాస్తులు వస్తున్నాయని, వీటిని పరిష్కరించే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. భూ భారతి చట్టం పటిష్ట అమలుకు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ.పద్మశ్రీ, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘రేషన్’ సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

జిల్లా పౌరసరఫరా శాఖ అధికారి చందన్‌కుమార్


నేలకొండపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న చందన్‌కుమార్

నేలకొండపల్లి: ఆహార భద్రత కార్డుదారులకు చేరువయ్యేలా కేంద్ర ప్రభుత్వం అన్నా సహాయత కార్యక్రమానిన ప్రవేశపెట్టిందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన రేషన్ దుకాణాలను తనిఖీచేశారు. బియ్యం నాణ్యత ఎలా ఉందని వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. అన్నా సహాయత కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డుదారులకు ఏమైనా సమస్యలుంటే ఫిర్యాదు చేసేందుకు హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. వాట్సాప్ నంబర్ 98682 00445 లేదా టోల్‌ఫ్రీ నంబర్ 14457 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ నంబర్లను రేషన్ దుకాణాల వద్ద బోర్డుపై ప్రదర్శించాలని డీలర్లను ఆదేశించారు. అనంతరం నేలకొండపల్లి గురుకుల బాలిక పాఠశాలను తనిఖీ చేశారు. భోజనం నాణ్యత ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ముదిగొండ మండలంలోని శ్రీ సత్యసాయి రైస్‌మిల్‌ను సందర్శించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్‌ను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కష్టపడాలి

- రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి జిల్లానే కారణం
- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం


మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రధాన కారణమని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన దళిత విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీలకు రిజర్వ్ చేసిన స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు గెలిచేలా తాను అండగా ఉంటానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలోని ప్రతీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డ్ మెంబర్లను గెలిపించుకునే బాధ్యత దళితులపై ఉందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రతీ దళిత బిడ్డకు అనేక అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో దళిత విజయోత్సవ సభ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

బీజేపీ దిష్టిబొమ్మ దహనం..

రాయ్‌బరేలిలో లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీపై బీజేపీ దాడిని ఖండిస్తూ పాత బస్టాండ్ ముందు మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, రాష్ట్ర కన్వీనర్ దర్గీ చెన్నారావు, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ నాయకులు దాసరి దానియేలు, నాయకులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, వేజెండ్ల సాయి కుమార్, సయ్యద్ గౌస్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, మొక్కా శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిల్‌తో పాఠశాలకు విద్యార్థి

ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చిన హెచ్‌ఎం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం నగరంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి మద్యం బాటిల్‌తో బుధవారం స్కూల్‌కు వచ్చాడు. తోటి విద్యార్థులు గమనించి ప్రధానోపాధ్యాయురాలి దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె విద్యార్థిని మందలించారు. ఆ విద్యార్థి పాఠశాల సమీపంలోని ఓ హాస్టల్‌లో ఉంటుండగా హాస్టల్ వార్డెన్‌ను సైతం పిలిపించి విషయం తెలియజేశారు. కాగా, పలు హాస్టళ్ల విద్యార్థులు మద్యంతో పాటు గుట్కాలు కూడా వినియోగిస్తున్నట్లు తెలిసింది. దీనిపై పాఠశాల హెచ్‌ఎం డీఈఓగా ఉన్న అదనపు కలెక్టర్ శ్రీజకు సైతం సమాచారం అందించారు. కాగా ఈ విషయమై గురువారం శ్రీజను నేరుగా కలిసి వివరిస్తామని హెచ్‌ఎం తెలిపారు.

మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

నేలకొండపల్లి: ఓ వ్యాపారికి రుణం ఇప్పిస్తామంటూ ముందుగానే కమీషన్ తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై బాధితుడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. వివరాలిలా.. మండలంలోని మంగాపురంతండాకు చెందిన ధీరావత్ రాధాకృష్ణ మూర్తి అనే వ్యాపారికి ఓ ప్రవేట్ ఫైనాన్స్ కంపెనీకి చెందిన ఉద్యోగి ఫోన్ చేశాడు. ‘ మీ సిబిల్ బాగుంది, 11 శాతం వడ్డీకి రూ.40 లక్షల రుణం ఇప్పిస్తా’ అని నమ్మబలికాడు. అందుకు రూ.40 వేలు ఇవ్వాలని కోరాడు.

కాగా, రాధాకృష్ణమూర్తి అతడికి రూ.20 వేలు ఫోన్ పే ద్వారా చెల్లించాడు. కానీ రుణం ఇప్పించకుండా తప్పించుకుంటుండగా తన పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తే ‘నీ ఇష్టం వచ్చింది చేసుకో’ అంటూ బెదిరిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

అనుమానాస్పద స్థితిలో నానమ్మ, మనవరాలు మృతి

- మంచిర్యాలలో ఘటన
- మృతులు ఖమ్మం జిల్లా వాసులు


సత్యవతి, గీతశిరీష (ఫైల్)

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోపాలవాడ రైల్వే ఏ క్యాబిన్ సమీపంలో ఉన్న ఓ ఇంట్లో ఖమ్మం నగరానికి చెందిన బెజ్జాల సత్యవతి(55), ఆమె మనవరాలు గీతశిరీష(4) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఇదే ఇంట్లో మూడేళ్ల క్రితం సత్యవతి చిన్న కుమారుడు(టాన్స్‌జెండర్) శిరీష (24) సైతం అనుమానాస్పదంగా మృతిచెందడం అప్పట్లో కలకలం రేపింది. ప్రస్తుతం నానమ్మ, మనవరాలు మృతిచెందడం చర్చనీయాంశంగా మారింది. మంచిర్యాల పోలీసులు తెలిపిన వివరాలిలాల..

ఇంటి అమ్మకానికి తీసుకొచ్చి...

ఖమ్మం త్రీటౌన్‌కు చెందిన బెజ్జాల చంద్రయ్య, సత్యవతి దంపతులకు ఇద్దరు కుమారులు గంగోత్రి, వెంకటేష్ ఉండగా.. చిన్న కుమారుడు వెంకటేష్ ట్రాన్స్‌జెండర్(శిరీష)గా మారి మంచిర్యాలలో స్థిరపడింది. గోపాలవాడ శివారులో రైల్వే ఏ క్యాబిన్ వద్ద ఓ ఇల్లు నిర్మించుకుని జీవనం సాగించింది. 2022 జనవరి 4న అనుమానాస్పదంగా మృతిచెందింది. అప్పటి నుంచి శిరీష కుటుంబ సభ్యులు తరచూ వచ్చి వెళ్తుండేవారు. ఈ క్రమంలో ఈ నెల 8న గంగోత్రి తన తల్లి సత్యవతి, కూతురు గీత శిరీషతో కలిసి ట్రాన్స్‌జెండర్ శిరీష ఇల్లు విక్రయించడానికి మంచిర్యాలకు వచ్చారు. 9న తనకు అస్తమా సమస్య వచ్చిందంటూ గంగోత్రి తల్లి సత్యవతి, కూతురు గీతశిరీషను ఇక్కడే వదిలి ఖమ్మం వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం తన తల్లి ఫోన్ లిఫ్ట్ చేయడం లేదంటూ పక్కింటి వారికి సమాచారం అందించాడు. స్థానికులు వెళ్లి పరిశీలించగా తలుపులు తీయకపోవడంతో డయల్ 100కు సమాచారం ఇచ్చారు. పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా సత్యవతి, గీతశిరీష విగతజీవులుగా కనిపించారు. ఈ విషయమై మంచిర్యాల పోలీసులు పలుమార్లు గంగోత్రికి సమాచారం ఇచ్చి రావాలని సూచించినా రాకపోవడంతో ఖమ్మం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

హత్యా.. ఆత్మహత్యా..

సత్యవతి, గీతశిరీష మరణంపై హత్యా.. ఆత్మహత్యా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటిని విక్రయించడానికి వచ్చిన ముగ్గురిలో ఇద్దరు ఇక్కడే ఉండడం, ఒక్కరే వెళ్లిపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఫుడ్ పాయిజన్ జరిగి ఉంటుందా అనేది చర్చనీయాంశంగా మారింది. మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఏం జరిగిందనేది పోస్టుమార్టం నివేదికలో తేలనుంది.

వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

కల్లూరు: వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిత తెలిపారు. వివరాలిలా.. కల్లూరు మున్సిపాలిటీ పరిధి లోని కప్పలబంధం గ్రామానికి చెందిన ఓ మహిళ అదే గ్రామానికి చెందిన కంటిపూడి యోహాన్‌తో నాలుగేళ్లుగా సహజీవనం చేస్తోంది. కాగా, యోహాన్ ఆమెను తీవ్ర వేధింపులకు గురి చేస్తుండగా.. తట్టుకోలేక గడ్డిమందు తాగింది. ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. దీనిపై మృతురాలి సోదరుడు ఫిర్యాదు చేయగా యోహాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పిడుగుపాటుతో రైతుకు గాయాలు


తీవ్రంగా గాయపడిన భావ్‌సింగ్

కామేపల్లి: పిడుగుపాటుతో ఓ రైతు తీవ్రంగా గాయపడిన ఘటనమండలంలో బుధవారం చోటు చేసుకుంది. కొమ్మినేపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ భావ్‌సింగ్ మిరప తోటలో పని చేస్తుండగా సాయంత్రం ఆకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలోనే భావ్‌సింగ్ సమీపంలోనే పిడుగు పడడంతో షాక్ కు గురై కిందపడిపోయాడు. పిడుగు ప్రభావంతో చర్మం కాలిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. పొరుగున ఉన్న రైతులు అతడిని వెంటనే ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

గడ్డిమందు తాగిన వ్యక్తి మృతి

ఖమ్మంఅర్బన్: గడ్డిమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై బుధవారం ఖమ్మంఅర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. నేలకొండపల్లి మండలం చెరువుమాధారానికి చెందిన కాటం గోపిరెడ్డి(31) హైదరాబాద్‌లో ప్రైవేట్‌ఉద్యోగం చేస్తున్నాడు. మూడురోజుల క్రితం ఆయన గడ్డిమందు తాగగా కుటుంబసభ్యులు గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం ఖమ్మంలోని మమతఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంట్రామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు. కాగా, ఘటన హైదరాబాద్‌లో జరిగినందును కేసును అక్కడికి బదిలీ చేస్తామని పోలీసులు తెలిపారు.

దాడి చేశారని ఫిర్యాదు

ఖమ్మంఅర్బన్: చెత్త తరలించే ప్రైవేట్ వాహనంలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని ఓ వ్యక్తి డయల్ -100కు కాల్ చేయడంతోపాటు సీపీకి సైతం బుధవారం ఫిర్యాదు చేశాడు. నగరంలోని శ్రీనగర్‌కాలనీ రోడ్డు నంబర్-1లో నివాసం ఉండే రంగిశెట్టి నాగేందర్ ఇంటి పక్కన, సమీపంలో కాలనీవాసులు చెత్త వేస్తుంటారు. ఈ క్రమంలో చెత్త సేకరించే ప్రైవేట్ వాహనంలో వచ్చిన వ్యక్తులు వచ్చి తమకు చెత్త వేస్తే డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని ఇలా వేస్తున్నారా? అంటూ అసభ్యకరంగా దూషిస్తూ తనపై, తల్లి ప్రమీలపై దాడికి పాల్పడినట్లు నాగేందర్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇంకుడుగుంతలో పడి చిన్నారి మృతి


తల్లిదండ్రులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే రాగమయి దయానంద్

సత్తుపల్లిరూరల్: ఇంటి ఆవరణలో ఉన్న ఇంకుడు గుంతలో పడి ఓ చిన్నారి మృతి చెందిన ఘసటన సత్తుపల్లి మండలం సత్యంపేటలో చోటుచేసుకుంది. మండలంలోని రుద్రాక్షపల్లి పంచాయతీ సత్యంపేట గ్రామంలో సోయం శివ, సంధ్యారాణి దంపతుల సంవత్సరం వయసు గల కుమార్తె మోక్షదుర్గ.. మంగళవారం సాయంత్రం ఇంటి ఆవరణలో ఆడుకుంటూ మూతలేని ఇంకుడుగుంతలో పడింది. కుటుంబ సభ్యులు గమనించకపోవడతో కొద్ది సేపటికి చిన్నారి మృతి చెందింది. ఆ తర్వాత చిన్నారి కోసం వెదుకుతుండగా ఇంకుడుగుంతలో మృతదేహం కనిపించింది. కాగా, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్‌విజయ్‌కుమార్ బుధవారం సత్యంపేటకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి చిన్నారి మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కారు పల్టీ


హైవేపై పల్టీ కొట్టిన కారు

ముదిగొండ: ఖమ్మం - కోదాడ నేషనల్ హైవేపై కారు పల్టీ కొట్టగా ఓ యువకుడికి గాయాలైన ఘటన ముదిగొండ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. ఖమ్మానికి చెందిన ఆసిఫ్ కారులో కోదాడ నుంచి ఖమ్మం వెళ్తున్నాడు. ముదిగొండ సమీపంలో కారు పల్టీ కొట్టడంతో కారు నుజ్జునుజ్జయింది. డ్రైవింగ్ చేస్తున్న ఆసిఫ్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

క్లుప్తంగా

ఫుడ్ పాయిజన్ అంటూ ప్రచారం

కూసుమంచి: మండలంలోని మల్లేపల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పాయిజన్ అయిదంటూ సోషల్ మీడియాలో ప్రచారం కాగా అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ ప్రచారంతో ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రాంచందర్‌రావు, ఎంఈఓ బీవీ రామాచారి హుటాహుటిన పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. మధ్యాహ్న భోజనంలో వండిన ఆకుకూర పప్పు రుచిలో తేడా ఉండటం, సాంబారు పుల్లగా ఉండటంతో పలువురు స్థానిక విద్యార్థులు ఇళ్లకు వెళ్లి భోజనం చేశారు. కాగా, భోజనం రుచిగా లేకపోవటంతో కొందరు విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లి భోజనం చేశారని, అంతేగానీ విద్యార్థులు ఎవరూ అస్వస్థతకు గురికాలేదని ఆర్డీఓ తెలిపారు.

కోలాహలంగా ‘కేటీపీఎస్’ ఎన్నికలు


మణుగూరులో పోలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

పాల్వంచ/మణుగూరురూరల్: కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ (పాల్వంచ) ఎన్నికలు బుధవారం కోలాహలంగా జరిగాయి. కేటీపీఎస్ కాలనీలోని డీఏవీ పాఠశాలలో పోలింగ్ కేంద్రంలో 2,100 మంది సభ్యులకు 1,728 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మణుగూరులోని బీటీపీఎస్ ఎస్‌పీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 500 మంది ఉద్యోగస్తులకు గాను 450మంది ఓటు వేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని వైటీపీఎస్‌లో 396 మంది ఓటర్లకుగాను 367 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో ఓటర్ల ను ఆకర్షించేలా ఫ్లకార్డులు, కరపత్రాలు, గుర్తులను సూచిస్తూ అభ్యర్థులు సందడి చేశారు. పోటీలో ఉన్న 37 మంది డైరెక్టర్ అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్యోగులను కలుస్తూ తమకే ఓటు వేయాలని అభ్యర్థించారు. సొసైటీలో మొత్తం 2,996 మంది ఓటర్లు ఉండగా, 2,545మంది ఓటు హక్కు విని యోగించుకున్నారు. మొత్తం 84.94శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. పోలీస్, ఎస్‌పీఎఫ్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

గుప్త నిధుల కోసం అన్వేషణ!

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో కొందరు గుప్త నిధుల కోసం అన్వేషిస్తున్నట్లు సమాచారం. ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు పగటి వేళల్లో లాడ్జిల్లో బస చేస్తూ, అర్ధరాత్రి వేళలో తవ్వకాలను జరిపే ప్రాంతాలను అన్వేషించేందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. వీరి తో పాటు గుప్తనిధుల ముఠా కమాండర్ జీపులో సంచరిస్తున్నట్లు సమాచా రం. మండలంలో పలు గ్రామాల్లో జీప్ తిరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని అశ్వారావుపేట ఎస్ఐ యయాతి రాజు దృష్టికి తీసుకువెళ్లగా.. రాత్రిళ్లు తిరిగే వాహనాలు, వ్యక్తులపై నిఘాపెడతామన్నారు. గుప్తనిధు లు వంటి ప్రచారాలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

కొనసాగుతున్న ఆర్టీసీ డ్రైవర్ల నిరసన


నిరసన తెలుపుతున్న టిమ్ డ్రైవర్లు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ డిపోలో టిమ్ డ్రైవర్లు చేపట్టిన నిరసన మూడో రోజు బుధవారం కూడా కొనసాగింది. 42 మంది టిమ్ డ్రైవర్లు విధులు బహిష్కరించి ఆందోళనలో పాల్గొంటున్నారు. దీంతో అధికారులు 10 సర్వీసులను తగ్గించారు. ఫలితంగా వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు యూనియన్ల నాయకులు జేఏసీగా ఏర్పడి, టిమ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డీఎం తిరుపతిని కోరారు. లేదంటే సమ్మె ఉధృతం చేస్తామని చెప్పారు. భద్రాచలానికి డిపోనకు చెందిన టిమ్ డ్రైవర్ నాగరాజు పని ఒత్తిడితో అనారోగ్యానికి గురైన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తోటి డ్రైవర్లు తెలిపారు. కాగా భద్రాచలం డిపోలో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ (ఎస్‌డీఐ)గా విధులు నిర్వహిస్తున్న పోకల సురేష్ తన పోస్టుకు మంగళవారం రాత్రి రాజీనామా చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,500	3,500
ఏసీ మిర్చి	15,200	8,000
మిర్చి	8,300	6,000
పత్తి	7,500	6,200

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,107